వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 189 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|





## వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల రాజకీయం

- పోటాపోటీగా ఆప్, బీజేపీల పోస్టర్ల యుద్ధం

న్యూఢిల్లీ,
అసెంబ్లీ ఎన్నికల వేళ.. దేశ రాజధాని దిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమ్‌ఆద్మీపార్టీ, భాజపా పోటీపడి వినూత్న ప్రచారం చేస్తున్నాయి. ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపుతూ, హామీల వర్షం కురిపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాజపా విడుదల చేసిన పోస్టర్‌కు ఆప్ తనదైనశైలిలో కౌంటర్ ఇచ్చింది. -మిగతా 3 లో



## చిన్మోయ్ కృష్ణ దాస్‌కు దక్కని బెయిల్

11మంది లాయర్ల బృందం ప్రయత్నాలు విఫలం

ఢాకా,
దేశ ద్రోహం నేరారోపణతో బంగ్లాదేశ్‌లో అరెస్టయి జైల్లో ఉన్న హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట లభించలేదు. ఆయన బెయిల్ పిటిషన్‌ను చటోగ్రామ్‌లోని కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోసం 11 మంది లాయర్ల బృందం ప్రయత్నించినప్పటికీ అది ఫలించలేదు. బంగ్లాదేశ్ లోని చటోగ్రామ్ మెట్రోపాలిటన్ -మిగతా 3 లో

## 14 నుంచే రైతు భరోసా

### కేబినెట్ సబ్ కమిటీలో మరోమారు చర్చ

- రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే యోచన
- సమావేశమై పలు కీలక నిర్ణయాలు
- సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయం
- జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశం
- అసలుసిసలు సాగుదారులకే సాయం





హైదరాబాద్,
రైతు భరోసాపై చర్చించిన కేబినేట్ సబ్‌కమిటీ ఇక సాగురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, -మిగతా 3 లో



## ఖజానాను ఖాళీ చేసిన బీఆర్ఎస్

-ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా వస్తుంది
-పార్టీ కార్యకర్తల భేటీలో మంత్రిపొన్నం

సిద్దిపేట,
పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్త స్థాయి నుంచి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశర చేశారు. వ్యవసాయం, -మిగతా 3 లో



## మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబు

- జనవరి 13 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ,
జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు -మిగతా 3 లో




## క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

-నలుగురికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలు
-డి.గుకేశ్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్, మను బాకర్‌ల ఎంపిక
-అర్జున అవార్డుకు 32మంది, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురి ఎంపిక
-అర్జున అవార్డుల్లో తెలుగమ్మాయిలు దీప్తి, యర్రాజీలకు చోటు

న్యూఢిల్లీ,
క్రీడా రంగంలో విశేష ప్రతిభకనబరిచిన క్రీడాకారులను అవార్డులతో కేంద్రం గౌరవించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలకు నలుగురిని ఎంపిక చేసిన కేంద్రం.. అర్జున అవార్డుకు 32మందిని, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురిని ఎంపిక చేసింది. భారత అత్యున్నత -మిగతా 3 లో

## సీఎంఆర్ కాలేజీ హస్టల్‌లో రహస్య చిత్రీకరణ

- విద్యార్థుల ఆందోళనపై మహిళా కమిషన్ స్పందన
- సుమోటాగా కేసు నమోదు...నివేదిక ఇవ్వాలని కమిషనర్ కు ఆదేశం
- వార్డెన్‌ను తొలగించామన్న ప్రిన్సిపాల్




హైదరాబాద్
మేడ్చల్ సీఎంఆర్ కాలేజీలో బాత్రూంలో దశ్యాలను చిత్రీకరించారని బుధవారం విద్యార్థినులు ధర్నాకు దిగిన వ్యవహారంలో వివాదం చెలరేగింది. దీంతో తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించింది. -మిగతా 3 లో

## బీసీల పేరుతో కవిత రాజకీయ డ్రామా

- కవిత బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తోంది
- బీసీలను అడుగడుగున అణగదొక్కిన బీఆర్ఎస్
- ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలన పై బహిరంగ చర్చకు సిద్ధమా.
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

ముందు బీసికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలి




హైదరాబాద్,
కవిత రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కి.. ఇప్పుడు బీసీ జపం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించిన్నట్లుగా ఉందని విమర్శించారు. బీసీ ధర్నా చేయాలని నిర్ణయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బీసీలకు బీఆర్ఎస్ పాలనలో చేసిన అన్యాయాలపై సమాధానం చెప్పిన తర్వాత, ధర్నా చేయాలన్నారు. -మిగతా 3 లో

# అసదుద్దీన్ పిటిషన్ విచారణకు సుప్రీం ఒకే




న్యూఢిల్లీ,
1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇవాళ అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15వ తేదీ నాడు మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని మెయిన్‌టేన్ చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17వ తేదీ ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.

# గోవాలో ఏపీ యువకుడి దారుణ హత్య



హైదరాబాద్,
న్యూ ఇయర్ వేడుకల వేళ గోవాలో దారుణం జరిగింది. కొత్త సంవత్సరం వేడుకలకు గోవా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ ఇయర్ వేడుకల కోసం తాడేపల్లిగూడెం నుంచి ఓ ఎనిమిది మంది యువకులు గోవా వెళ్లారు. డిసెంబర్ 29వ తేదీన అర్ధరాత్రి గోవాలోని ఓ రెస్టారెంట్‌లో 8 మంది దిగారు. 31న అర్ధరాత్రి ఫుడ్ ఆర్డర్ విషయంలో వీరికి.. రెస్టారెంట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫుడ్ రేట్ల గురించి ప్రశ్నించిన యువకులపై రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రవితేజ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా రవితేజ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై రవితేజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పట్టుకునేందుకు ప్రయత్నించిన వారిపై పులి దాడి



జైపూర్,
గ్రామంలో కొన్నిరోజులుగా సంచరిస్తున్న పులి మనుషులపై దాడి చేస్తున్నది. ఈ విషయం తెలిసిన అటవీశాఖ సిబ్బంది పలు వాహనాల్లో ఆ గ్రామానికి చేరుకున్నారు. పులిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే రెస్క్యూ వాహనంపై దాడికి పులి యత్నించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సుమారు 42 పులులున్న సరిస్కా టైగర్ రిజర్వ్ నుంచి మూడు పులులు తప్పించుకున్నాయి. ఆ అటవీ ప్రాంతం సమీపంలోని గ్రామాల్లో అవి సంచరిస్తున్నాయి. పొలంలో పని చేస్తున్న మహిళతో సహా ముగ్గురు వ్యక్తులపై ఒక పులి దాడి చేసింది. వారిని జైపూర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, పులి సంచారం, దాడి గురించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో పలు వాహనాల్లో ఆ గ్రామానికి చేరుకున్నారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పులిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా రెస్క్యూ వాహనంపై పులి దాడి చేసింది. దానిపైకి జంప్ చేసేందుకు ప్రయత్నించింది. ఆ తర్వాత పులి అక్కడి నుంచి పొదల్లోకి పారిపోయింది. మరోవైపు వారం కిందట సరిస్కా టైగర్ రిజర్వ్ నుంచి తప్పించుకున్న పులి నంబర్ 2402ను పట్టుకుని కాపాడేందుకు అటవీశాఖ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అక్కడి నుంచి తప్పించుకున్న మరో రెండు పులులు జైపూర్ పరిధిలోని జామ్వా రామ్‌గఢ్ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. అయితే రెస్క్యూ వాహనంపై పులి దాడికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# రైతు భరోసాపై షరతులా..?

## -సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత ఫైర్



హైదరాబాద్,
రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వంకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం అమలుకు నిబంధనలను పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రైతులకు షరతులు విధించడమేంటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా అని నిలదీశారు. ఎటువంటి నిబంధనలను విధించకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం నాడు తన నివాసంలో జరిగిన బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని అన్నారు. ఇప్పటికే ప్రజా పాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటారని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడుతారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ ఈ కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని అన్నారు. రైతు భరోసాకు షరతులు, నిబంధనలు పెట్టి పెట్టుబడి సాయాన్ని ఎగవేసే ప్రయత్నం చేస్తున్నారని ఎండగట్టారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందని తెలిపారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేశారని, దాంతో ప్రజలు ఆ పార్టీ నాయకులపై గుర్రుగా ఉన్నారని తెలిపారు. మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామని, 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి%ౌ% ఇప్పుడు రైతు భరోసాకు షరతులు విధించే ప్రయత్నిస్తూ దగా చేస్తున్నారని చెప్పారు. హామీల అమలుపై ప్రతీ ఒక్కరు గళమెత్తాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. ముఖ్యంగా గతంలో కేసీఆర్ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాల వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా నడవాలని సూచించారు. కేసీఆర్, తాము అండగా ఉంటామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో క్రీడాకారులకు ప్రోత్సాహం


## -దీప్తి జివాంజికి సిఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్,
తెలంగాణ అమ్మాయి, పారిస్ పారాలింపిక్స్ పతక విజేత దీప్తి జివాంజి అర్జున అవార్డుకు ఎంపికైన సందర్భంగా దీప్తి జివాంజికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శభాకాంక్షలు తెలిపారు. పారాలింపిక్స్‌లో భారత్ తరఫున కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ దీప్తి జీవాంజి విశిష్ట క్రీడా పురస్కారం అర్జున అవార్డు 2024కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రజా ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి దీప్తికి రూ.1 కోటి నగదు బహుమతితో పాటు గ్రూప్-2 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించిన విషయం తెలిసిందే. తెలంగాణ యువ క్రీడాకారులు మరింతగా రాణించాలని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితం కానున్న స్పోర్ట్స్ కాంప్లెక్సులు అందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే, క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేష్ (చెస్), హర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (ప్యారా అ÷-లథెటిక్స్), మను బాకర్ (షూటింగ్)లకు సైతం సీఎం రేవంత్ కంగ్రాట్స్ చెప్పారు. వీరితో పాటు 2024కు సంబంధించి వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లకు కూడా రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# జనంపైకి దూసుకెళ్ళిన కారు

## అమెరికాలో10మంది మృతి, 30మందికి పైగా గాయాలు



న్యూఆర్లీన్స్
నూతన సంవత్సరం వేడుకల వేళ అమెరికాలో విషాదం చోటు చేసుకుంది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు చేసుకుంటున్న జనంపైకి హఠాత్తుగా ఒక వాహనం దూసుకువచ్చింది. ఈ ఘటనలో 10మంది మృతి చెందగా 30మంది వరకు గాయపడ్డారని అధికారులు తెలిపారు. న్యూ ఆర్లీన్స్‌లోని కెనాల్, బర్బాన్ వీధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వెంటనే ఆ ప్రాంతం నుండి ప్రజలందరినీ దూరంగా పంపివేసిన అధికారులు గాయపడిన వారిని సమీపంలోని ఐదు ఆస్పత్రుల్లో చేర్చారు. నగరంలో కాలేజీ ఫుట్‌బాల్ క్వార్టర్ ఫైనల్ కొద్ది గంటల్లో ప్రారంభం కావాల్సి వుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కారు జనంపైకి దూసుకురావడం ప్రమాదవశాత్తూ జరిగిందా, ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా అనేది తెలియాల్సి వుంది.

# ఏపీలో ఘోరం.. భర్తను చంపిన భార్య



అమరావతి
నడి రోడ్డుపై భర్త మెడకు తాడు బిగించి భార్య హత్య చేసిన ఘటన ఏపీలోని బాపట్ల జిల్లాలో జరిగింది. కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే కొత్తపాలెంకు చెందిన అరుణకు గోకర్ణమఠంకు చెందిన అమరేంద్రబాబుకు పదేళ్ల క్రితం పెళ్లయింది. అమరేంద్రబాబు నాలుగేళ్ల క్రితం మద్యానికి బానిస అయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. గొడవల నేపథ్యంలో ఆమె భర్తను వదిలేసి స్వగ్రామం కొత్తపాలెంలో ఉంటోంది. దీంతో ఆమె ఇంటికి వెళ్లిన అమరేంద్రబాబు ఆమెతో మళ్లీ గొడవపడ్డాడు. తన భార్య అరుణను కొట్టాడు. దీంతో అతనిపై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ దాడిలో కింద పడ్డ అమరేంద్ర గొంతుకు అరుణ తాడు వేసి లాగి చంపేసింది.

# 14నుంచే రైతుభరోసా

(మొదటి తరువాయి)

భూమి పరిమితి పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించనున్నారు. జనవరి 5 నుంచి 7 వరకు దరఖాస్తులు తీసుకునే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను చెల్లిస్తామన్న ప్రభుత్వం.. నాలుగో తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు సభ్యులుగా ఏర్పాటైన ఉపసంఘం ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమై చర్చించింది. రైతు భరోసా పంపిణీపై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ పథకం అమలు విధి విధానాల కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ.. గురువారం నాడు కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రైతు భరోసాకు సంబంధించి మంత్రివర్గ సభ్యులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలి.. ఎంతమేర భూమికి ఇవ్వాలి.. ఈ పథకానికి సంబంధించిన నిధులు రైతుల ఖాతాల్లో ఎప్పటి నుంచి జమ చేయాలి.. అనే అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పంట పండించే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని చర్చించారు. అలాగే.. రైతు భరోసా కోసం రైతుల నుంచి అప్లికేషన్స్ తీసుకోవాలని నిర్ణయించారు. జనవరి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. అయితే, ఈ తేదీలను ఇంకా ఖరారు చేయలేదు. ఇక జనవరి 14వ తేదీన సంక్రాంతి పర్వదినం సందర్భంగా.. రైతుల ఖాతాల్లో రైతు భరోసా పథకం నిధులు జమ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# చిన్మోయ్ కృష్ణ దాస్‌కు దక్కని బెయిల్

(మొదటి తరువాయి)

షన్స్ కోర్టులో 30 నిమిషాల పాటు ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. చిన్మయ్ అరెస్టు అనంతర పరిణామాలను దృష్టిలోపెట్టుకొని గురువారం న్యాయస్థానం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రస్తుతానికి ఆయనకు బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చిచెప్పింది. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ బంగ్లా జాతీయజెండాను అగౌరవ పరిచారనే అభియోగాలపై 2024 నవంబరు 25న పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా.. అతడిపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా.. ఆయనపైనా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ.. 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. హిందూ సాధువు చిన్మోయ్ కృష్ణ దాస్ బంగ్లాదేశ్‌లో నెల రోజులకు పైగా జైలులో ఉన్నారు. ఈ క్రమంలో కూడా ఆయనకు మళ్లీ షాకింగ్ న్యూస్ వచ్చింది. గురువారం చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిపి ఆయన బెయిల్‌ను తిరస్కరించారు. దీంతో చిన్మయ్ దాస్ మరికొంత కాలం జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ విచారణ సమయంలో 11 మంది న్యాయవాదులతో కూడిన బెంచ్ విచారణలో పాల్గొన్నా కూడా, చిన్మోయ్ కృష్ణ దాస్‌కు బెయిల్ లభించలేదు. అంతకుముందు డిసెంబర్ 11న బంగ్లాదేశ్ కోర్టు దాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విధానపరమైన లోపాల కారణంగా తిరస్కరించింది. ఇది చాలా బాధాకరమైన వార్త అని కోల్‌కతా ఇస్కాన్ వీపీ రాధా రామన్ అన్నారు. ప్రపంచం మొత్తం దీన్ని గమనిస్తోందన్నారు. కొత్త సంవత్సరంలో చిన్మయ్ ప్రభుకి స్వేచ్ఛ లభిస్తుందని అందరూ ఆశించారని పేర్కొన్నారు. అయితే 42 రోజుల తర్వాత కూడా ఈరోజు విచారణలో ఆయన బెయిల్ తిరస్కరించబడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. చిన్మోయ్ కృష్ణ దాస్‌పై బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచినట్లు ఆరోపణలు పెడుతూ దేశద్రోహం కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో ఆయన తరపున న్యాయవాది అపూర్బా కుమార్ భట్టాచార్జీ నేతృత్వంలో బంగ్లాదేశ్ న్యాయవాదులు వాదిస్తున్నారు. 2024 నవంబర్ 25న ఛటోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత, బంగ్లాదేశ్ న్యాయవాదుల బృందం ఈ కేసును విచారిస్తోంది. చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టు తరువాత 2024 నవంబర్ 25న చటోగ్రామ్‌లోని న్యాయస్థానం ఆయనపై దేశద్రోహం కేసులో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నప్పటికీ, ఆయన తరపున న్యాయవాదులు బెయిల్ కోసం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఛాతీ నొప్పి కారణంగా న్యాయవాది చిన్మోయ్ కృష్ణ దాస్ కార్డియాలజీ విభాగంలో చేరారు. భౌతిక అస్వస్థత కారణంగా జనవరి 2న చిట్టగాంగ్ కోర్టులో దేశద్రోహం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న చిన్మోయ్ కృష్ణ విచారణకు ఆయన హాజరుకాలేదు. చిన్మయ్ దాస్ అరెస్టుపై, దాస్ బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటు న్నారని ఆయనపై వచ్చిన ఆరోపణల గురించి ఢాకా పోలీసులు తెలిపారు. చిన్మయ్ దాస్‌పై బీఎన్పీ మాజీ నేత ఫిరోజ్ ఖాన్ కూడా ఈ ఆరోపణలు చేశారు. అక్టోబర్ 25న చిట్టగాంగ్‌లో హిందూ సంఘాల ర్యాలీ జరిగిందని ఖాన్ ఆరోపించారు. అక్కడే చిన్మోయ్ దాస్, మరో 18 మంది వ్యక్తులు బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారని అన్నారు. అయితే ఆ సమయంలో బీఎన్పీ నేతగా ఉన్న ఫిరోజ్ ఖాన్ పార్టీ ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే బీఎన్‌పీ నుంచి బహిష్కరించబడ్డారు.

# సీఎంఆర్ కాలేజీ హాస్టల్‌లో రహస్య చిత్రీకరణ

(మొదటి తరువాయి)

కాలేజీ ఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని సైబరాబాద్ కమిషనర్‌కు మహిళా కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అమ్మాయిల బాత్ రూమ్‌లలో కెమెరాలు పెట్టి 300కు పైగా అశ్లీల వీడియోలు తీసినట్లుగా వచ్చిన మీడియా కథనాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు ఈ ఘటనపై విద్యార్థినిలు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. కళాశాలల ఛైర్మన్ గోపాల్ రెడ్డి విద్యార్థి సంఘాల నేతలతో చర్చలు జరిపారు. కాగా సీఎంఆర్ కాలేజీ ఘటనపై యాజమాన్యం నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.మేడ్చల్ సీఎంఆర్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్ రూమ్‌లో విద్యార్థినుల నగ్న వీడియోలు చిత్రీకరించారని స్టూడెంట్స్ చేస్తోన్న ఆందోళనపై ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..విద్యార్థినులు బుధవారం మధ్యాహ్నం తమకు కంప్లైంట్ చేశారని ఆయన తెలిపారు. కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లోని కొందరు అనుమానితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వార్డెన్ టర్మినేట్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారని.. వారి కోరిక మేరకు హాస్టల్ వార్డెన్ ను విధుల నుండి తొలగించామన్నారు. ఈ విషయంలో అండగా ఉంటామని విద్యార్థునులకు హామీ ఇచ్చామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. హాస్టల్ సీసీ టీవీ ఫుటేజ్ పోలీసులకు ఇచ్చామని.. పోలీసుల విచారణకు పూర్తిగా సపోర్ట్ చేస్తామన్నారు. ఘటన నుండి హాస్టల్ వార్డెన్ ప్రీతిని మేం తప్పించినట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని.. ఇప్పటికే మేం ఆమెను టర్మినేట్ చేశామని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఐదుగురు లేడి సీనియర్ స్టాఫ్‌తో కమిటీ వేసి విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. స్టూడెంట్స్ మా పిల్లలతో సమానమని.. వారి భద్రతే మాకు ముఖ్యమన్నారు. నిందితులు ఎవరైనా సరే సీరియస్ యాక్షన్ తీసుకొంటామని స్పష్టం చేశారు. హాస్టల్ బాత్ రూమ్‌లో మొబైల్ ఫోన్లు పెట్టి తమ నగ్న వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ సీఎంఆర్ కాలేజీ విద్యార్థునులు బుధవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. స్టూడెంట్స్‌కు మద్దతుగా విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగి.. కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. హాస్టల్ కుకింగ్ డిపార్ట్‌మెంట్‌లో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

(మొదటి తరువాయి)

క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికి గాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్, హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్, షూటింగ్ విభాగంలో మను బాకర్‌ను ఈ అవార్డులు వరించాయి. అలాగే, 32మందిని అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. జనవరి 17న ఉదయం 11గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీరంతా పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత స్వాతంత్య్రం వచ్చాక.. ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌కు ఖేల్ రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా ప్లేయర్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఇక అర్జున అవార్డులు దక్కిన వారిలో ఇద్దరు తెలుగు అమ్మాయిలు ఉన్నారు. జ్యోతి యర్రాజి (అ÷-లథెటిక్స్),దీప్తి జువ్వాంజి ఉన్నారు. ఇక మిగిలిన వారిలో అన్ను రాణి (అ÷-లథెటిక్స్), నీతు (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), అవంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్‌జీత్ సింగ్ (హాకీ) స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్), సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్),అమన్ (రెజ్లింగ్),రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్),ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్),అజీత్‌సింగ్ (పారా అథ్లెటిక్స్),సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్),ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్),హెచ్. హోకాటో సీమ(పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్) మనీశా రాం దాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జుడో),మోనా అగర్వాల్ (పారా షూటింగ్) రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్), అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్), సుచా సింగ్ (అ÷-లథెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్) ఉన్నారు.

# వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల రాజకీయం

(మొదటి తరువాయి)

ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకే అడ్రస్‌లో వందల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని భాజపా ఎక్స్ వేదికగా ఆరోపించింది. ఇంటి యజమానికి తెలియకుండా నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేస్తున్నారని దుయ్యబట్టింది. ఇది కేజ్రీవాల్ కొత్త గేమ్ అంటూ తీవ్ర విమర్శలు చేసింది. ఆప్‌నకు నకిలీ ఓటర్లపై ప్రేమ అనే అర్థం వచ్చేలా ఒక పోస్టర్‌ను షేర్ చేసింది. దీనికి ఆప్ కౌంటర్ ఇచ్చింది. ఆ విమర్శను తిప్పి కొడుతూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అంటూ కేజ్రీవాల్ ఉన్న ఒక పోస్టర్ వీడియోను పంచుకుంది. ఇదిలాఉంటే.. దిల్లీలో ఓటర్లకు భాజపా నగదు పంపిణీ చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈమేరకు అరవింద్ కేజ్రీవాల్ ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్‌కు లేఖ రాశారు. కమలం పార్టీ చేస్తున్న తప్పిదాలను ఆరెస్సెస్ ఆమోదిస్తుందా? అని అందులో ప్రశ్నించారు. ఈ లేఖపై భాజపా స్పందిస్తూ.. ఇలా మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం ఆరెస్సెస్ అధ్యక్షుడికి లేఖ రాయడానికి బదులు ఆ సంస్థ నుంచి సేవా స్ఫూర్తిని నేర్చుకోవాలని కేజ్రీవాల్‌కు హితవు పలికింది. దేశ రాజకీయాల్లోనే ఆప్ అవిశ్వసనీయ పార్టీకి ఉదాహరణ అని, దీనిని ప్రజలు అర్థం చేసుకున్నారని భాజపా అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ఎదురుదాడి చేశారు. అబద్ధాలు చెప్పడం మానుకోవడానికి నూతన సంవత్సరం రోజున కేజ్రీవాల్ తీర్మానించుకోవాలని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ కేజ్రీవాల్‌కు మరో లేఖ రాశారు.

# ఖజానాను ఖాళీ చేసిన బీఆర్ఎస్

(మొదటి తరువాయి)

రైతు సంక్షేమం కోసం రూ.30 వేల కోట్లు కేటాయించామన్నారు. కేబినెట్ సబ్ కమిటీలో రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటాం. సంక్రాంతికి రైతు భరోసా, త్వరలోనే కొత్త రేషన్ కార్డులు వస్తాయి. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా ఉంటుంది. నిజమైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తం. కార్యకర్తలకు అందుబాటులో ఉంటా.. నా గెలుపుకు మీరంతా కష్టపడి పనిచేశారు. ఈ ప్రాంతానికి ఏం ఇచ్చిన రుణం తీర్చుకోలేను. ఎంత చేసినా తక్కువే.. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి.. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా పనిచేయండి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున్న తీసుకువెళ్లాలి. హుస్నాబాద్?కు 250 పడకల హాస్పిటల్ మంజూరు అయింది. ' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ ముస్తాబు

(మొదటి తరువాయి)

బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

# బీసీల పేరుతో కవిత రాజకీయ డ్రామా

(మొదటి తరువాయి)



ఈ మేరకు పలు ప్రశ్నలతో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన కవిత బీసీల పేరిట కపట నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. పదేండ్లు బీసీలను పట్టించుకోకుండా.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని ్ర÷ర్?అయ్యాడు. 'బీసీలకు అన్యాయం చేసి గొంతు కోసింది బీఆర్ఎస్ పార్టీ. లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న కవిత దాన్ని పోగొట్టుకోవడానికి బీసీ డ్రామా చేస్తుంది. ఫస్ట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీ నేతకు అవకాశం ఇవ్వండి.. తర్వాత ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నాకు పీసీసీ చీఫ్ గా పదవి ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నం. వారికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా సలహాలు, సూచనలు ఇవ్వాల్సింది పోయి ధర్నా చేపట్టడం దురదృష్టకరం. బీసీల అభివృద్ధి కోసం పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చర్యలు, ప్రస్తుతం ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపట్టిన చర్యలపై కవిత బహిరంగ చర్చకు సిద్ధమా' అని పీసీసీ చీఫ్ సవాల్ చేశారు.

## సంపాదకీయం

# అన్నదాతలను వంచిస్తున్న ప్రభుత్వాలు

వ్యవసాయ సంక్షోభాన్ని అధ్యయనం చేసి, అన్నదాతలను గట్టెక్కించే ప్రయత్నాలు ఏవీ ముందుకు రావడం లేదు. హామీలన్నీ అటకెక్కుతున్నాయి. ఎన్నికల ముందు అన్ని పార్టీలు అన్నదాతల గురించి, వారి సమస్యల గురించి చర్చిస్తారు. అందమైన అబద్దాలను ఇంపుగా చెబుతారు. గద్దెనెక్కాక యధావిధిగా మర్చిపోతున్నారు. అందుకే దేశంలో వ్యవసాయరంగం లాభసాటిగా లేకుండా పోతోంది. రైతులకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మద్దతు ధరల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. దగాపడుతున్న అన్నదాతను ఆదుకునే ప్రయత్నాలు కేవలం కంటితుడుపు చర్యగానే ఉన్నాయి. సకాలంలో ఎరువుల అందవు. విత్తనాల కొరత యధావిధిగా ఉండనే ఉంటుంది. ఎరువులు, నకిలీ విత్తనాలు, మార్కెట్లో మోసాలను తట్టుకుని మనకు అన్నం పెడుతున్న రైతన్న విషయంలో ఏ ప్రభుత్వం అయినా న్యాయం చేయడం లేదు. నిలదీస్తే వారిని నిలువరిస్తున్నారు. దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణన లోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాం ఒక ప్రధాన జీవన రంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లకు గురి చేస్తోంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26వ తేదీన నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్రప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం. ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతు న్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. మోసకారి విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధరను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి తీసుకోవాలని లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది. అలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బ్జడెట్లో వ్యవసాయరంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళు చేసివుంటే– కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి.భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయ రంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి. వీటి విషయంలో ఖచ్చితమైన నిబంధనలు రావాలి. అప్పనంగా రైతుల న ఉంచి భూములను లాక్కోవడం, వారికి అరకొరగా విదిల్చడం చేస్తున్నారు. మద్దతు ధరలు, ఎరువుల విధానం, మార్కెట్ల బలోపేతం వంటివన్నీ సక్రమంగా జరగాలి. భూములను అప్పనంగా గుంజుకునే విధానం పోవాలి. లాఠీఛార్జీలు చేయడం, వారిని రోడ్డెక్కించే బరితెగింపు పనులు ఇకముందు సాగకుండా చూడాలి. పారిశ్రామిక వేత్తలకు భూములు కావాలంటే బహిరంగ వేలంలో కొనుగోలు చేసుకునేలా కఠిన చట్టాలు తీసుకుని రావాలి. ఇలా చేస్తే తప్ప అన్నదాత మనుగడ సాగదు.

# సామాజిక వైవిధ్యంలో జీవన సౌందర్యం

తబలా మేస్ట్రో జాకిర్ హుస్సేన్ ఇటీవల మరణించిన తరువాత ఆయనకు సంబంధించిన ఒక పాత విడియో క్లిప్ సామాజిక మాధ్యమాలలో మళ్లీ కనిపిస్తోంది. అందులో ఆయన తన తండ్రి, సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీతకారుడు అల్లా రఖా చెప్పిన కొన్ని మాటలను గుర్తు చేసుకున్నారు: 'నేను చదువుల తల్లి సరస్వతిని, ప్రథమ పూజ్యుడు వినాయకుడిని ఆరాధిస్తుంటాను. వారు నా ఉపాధ్యాయులు'. విశేషంగా ఆకట్టుకునే, అంతకంటే ఆసక్తికరమైన ఈ విలువైన వాక్కులు మతనిష్ఠాపరుడు, దైవ భీతుడు అయిన ఒక ముస్లిం మతస్తుడివి. మన భారతావనిలో శతాబ్దాలుగా హిందువులు, ముస్లింల మధ్య సమున్నత సాంస్కృతిక సమ్మేళనాన్ని సూచిస్తున్న మాటలు అవి. అంతేకాదు, ఒక స్పష్టమైన మనోవైఖరిని అవి వ్యక్తం చేస్తున్నాయి. 'గంగా%–%జముని' తెహ్‌జీబ్ (సంప్రదాయం)గా ఆ విశిష్ట మనోవైఖరి మన ప్రజల జీవన రీతుల్లో ప్రతిబింబిస్తోంది. గంగా%–%జముని సంప్రదాయం ఒక సంయుక్త లేదా ఉమ్మడి సంస్కృతిని పరివేష్టించి ఉన్న సంప్రదాయమే 'గంగా%–%జముని'. మతసహిష్ణుత, ఒక సాంస్కృతిక వారసత్వ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంకీర్ణ సంస్కృతి అది. మన సంగీతం, లలితకళలు, వాస్తురీతులు, వంటకాలలో అది నిండుగా కనిపిస్తుంది. అయితే దేశ విభజన బీభత్సాలు, వాటి చేదు జ్ఞాపకాలు, ఇటీవలి కాలంలో సంకుచితమైపోయిన సామాజిక దృక్పథాల నేపథ్యంలో 'గంగా%–%జముని' సంప్రదాయం గత కాలం గురించి ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతోంది! వివిధ చింతనా ధోరణుల సమన్వయాన్ని, మన సంప్రదాయ సహనం, సమైక్యతా స్ఫూర్తిని మనం ఉద్దేశపూర్వకంగానే తిరస్కరిస్తున్నామా? అదే నిజమైన పక్షంలో మన సామాజిక జీవన రీతులలో సువ్యక్తమవుతున్న సంక్లిష్ట మత, సాంస్కృతిక, భాషా పరమైన వైవిధ్యాలను ఎలా సమన్వయం చేసుకోగలుగుతాం? క్రీ.శ. 712లో సింధ్ ప్రాంతంపై అరబ్‌ల దండయాత్రతో ఇస్లాం భారతావనిలోకి ప్రవేశించింది. మొగల్ చక్రవర్తుల కాలంలో ఆ కొత్త మతం మన దేశంలో విస్తృతంగా వ్యాపించింది. ఇస్లాంను స్వీకరించిన వారిలో అత్యధికులు కుల వ్యవస్థ అన్యాయాలు, దురాగతాలను తప్పించుకునేందుకై బలవంతంగానో లేదా స్వచ్ఛందంగానో ఆ మతంలో చేరినవారే. క్రైస్తవ



భారతీయులు తమ చరిత్ర సెయింట్ థామస్ కేరళలో అడుగిడిన నాటి నుంచి ప్రారంభమవుతుందని విశ్వసిస్తారు క్రీ.శ 52లో సెయింట్ థామస్ మలబారు ప్రాంతంలోని యూదులను క్రైస్తవంలో చేరేలా ప్రేరేపించి మన దేశంలో క్రైస్తవం నెలకొనేందుకు, వర్ధిల్లేందుకు దోహదం చేశారని భావిస్తారు. చరిత్ర పరిణామ క్రమంలోని వేర్వేరు దశలలో యూదు, పార్శీ, బహాయీ మతస్తులు మన దేశానికి శరణార్థులుగా వచ్చి, ఆ తరువాత స్వేచ్ఛగా తమ మతాలను విస్తరింప జేసుకుని వర్ధిల్లుతున్నారు. మన తీరాలకు క్రైస్తవం, ఇస్లాం వచ్చిన శతాబ్దాల తరువాత భారతదేశ జనాభా మతాల వారీగా ఇలా ఉంది: హిందువులు 79.8 శాతంబీ ముస్లింలు 14.2 శాతం, క్రైస్తవులు 2.3 శాతం. ఇప్పుడు అన్ని మతాల వారిలోను సంతానోత్పత్తి రేట్లు పడిపోతున్నాయి. వాస్తవ పరిస్థితి ఇదయితే కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించుతున్న కారణంగా హిందూ జనాభా తగ్గిపోతోందని, అదే సమయంలో ఆ పద్ధతులను పాటించని కొన్ని ఇతర మతాల వారి సంఖ్య గణనీయంగా ఎదుగుతుందని, ఇది ఇలాగే కొనసాగిన పక్షంలో హిందువులు తమ జన్మ భూమిలోనే మైనారిటీలు అయిపోతారనే వాదన ఒకటి గట్టిగా విన్పిస్తోంది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే. అంతేకాదు చాలా ప్రమాదకరమైన భయాందోళనలను రగుల్కొల్పే వాదన. 1996లో అమెరికా సామాజిక శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్టన్ 'నాగరికతల సంఘర్షణ' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచం భవిష్యత్తులో నాగరికత ప్రాతిపదికన విభజితమైపోతుందని, భావజాలాల మధ్య కాకుండా, మౌలికంగా విభిన్నమైన మతాలు, సంస్కృతుల మధ్య సంఘర్షణలు ప్రజ్వరిల్లుతాయనేది ఆ సిద్ధాంత సారం మరి బహుళ సంస్కృతులు, మతాలు ఉన్న భారతదేశమే హంటింగ్టన్ ప్రమాదకర జోస్యం నిజమయ్యేందుకు అత్యధిక అవకాశమున్న నెలవుగా కనిపిస్తోంది. వైవిధ్యాన్ని ఆదరిస్తూ సహన భావాన్ని పెంపొందించడంలోను, ఆర్థికంగా, సాంస్కృతికంగా పరస్పర సంబంధాలను ప్రోత్సహించడంలోనూ భారత ప్రజాస్వామ్యం ఇంతవరకూ సత్ఫలితాలను సాధించింది. సమస్త భారత పౌరులకూ సాపేక్షంగా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అవి విశేషంగా దోహదం చేశాయి. మరి హంటింగ్టన్ ప్రతిపాదన ప్రకారం అనివార్యమైన హిందూ, ఇస్లామిక్ నాగరికతల సంఘర్షణను భారత్ అధిగమించగలదా? కాలమే నిర్ణయిస్తుంది. అయితే కొన్ని వాస్తవాలను నిశితంగా పరిశీలిద్దాం. గత ప్రభుత్వాలు స్వార్థ ప్రయోజనాల కోసం మైనారిటీ మతస్తులను బుజ్జగించాయి. తద్వారా ఎన్నికలలో ప్రయోజనం పొందాయి. అయితే ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. పూర్తిగా విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయి. బుజ్జగింపులు ఏ మాత్రం లేకపోగా మైనారిటీ మతాలవారు తీవ్ర వివక్షకు, బెదిరింపులకు గురవుతున్నారు. వారి ఆరాధనా మందిరాలపై దాడులు జరుగుతున్నాయి. నివాస గృహాలు కూల్చివేయబడుతున్నాయి. అంతే కాకుండా మైనారిటీ వర్గాలవారు ఆర్థికంగా, సామాజికంగా వెలివేతకు గురవుతున్నారు. హంతక ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఇవి, మైనారిటీ మతస్తులు నేడు ఎదుర్కొంటున్న కష్టనష్టాల్లో కొన్ని మాత్రమే. కొంతమంది మతాచార్యులు, పాలక వర్గాల పెద్దలు ముస్లింలు, క్రైస్తవుల పట్ల విద్వేషాన్ని పనిగట్టుకుని రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వాలు ఉపేక్ష వహిస్తున్నాయి, మీడియా మౌనం పాటిస్తోంది. ఇది చోటుచేసుకుంటున్న విపత్కర పరిణామాలకు మౌన అంగీకారమా? కుల మతాల ప్రాతిపదికన ప్రజలను విభజించే కుటిల రాజకీయాలు పెచ్చరిల్లుతున్నాయని మన ఎన్నికల చరిత్ర స్పష్టం చేస్తోంది.


# భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌గా ప్రసిద్ధుడయిన భీంరావ్ రాంజీ అంబేద్కర్, మన భారత రాజ్యాంగ రూపశిల్పి. తొలి కేంద్ర న్యాయ శాఖా మంత్రి, ఆర్థిక వేత్త, సంఘ సంస్కర్త. ముఖ్యంగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంఘర్షించిన రాజకీయవేత్త. దేశంలో నవయాన బౌద్ధానికి దారులు వేసిన ఆధునిక నవబౌద్ధుడు. కాలం గడుస్తున్నకొద్దీ ప్రజలు అంబేద్కర్‌ని బాగా అర్థం చేసు కుంటున్నారు. దళితులు బహుజనులు మాత్రమే కాదు, అన్ని వర్గాల వారు, అన్ని మతాల వారూ అంబే ద్కర్ చూపిన మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే 1956 మార్చి 18న ఆగ్రా నగరంలో ఒక సంఘటన జరిగింది. అక్కడ ఆరోజు డా.బి.ఆర్. అంబేద్కర్ (1891 ఏప్రిల్ 14 – 1956 డిసెంబర్ 6) తన అనుచరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురై, ఉన్న ఫళాన కంటతడిపెట్టారు. 'ఏమిటీ? ఏమైంది?' అని అనుచరులు కంగారు పడి అడిగినప్పుడు ఆయన కొన్ని విషయాలు చెప్పారు. అవి ఇలా ఉన్నాయి. తన జాతి వాసుల్ని తను ఎలా చూడాలనుకున్నారు? వాళ్లు ఎలా తయారయ్యారు? అన్న విషయం బేరీజు వేసి చూపారు. తనవాళ్లను ఉద్దేశించి ఇలా అన్నారు %–%నేనేమో మిమ్మల్ని రాజులను చేయాలనుకున్నాను. మీరేమో లాభసాటి నౌకర్లలా మిగిలి పోవాలని అనుకుంటున్నారు. నేనేమో మిమ్మల్ని రత్నాలుగా చూడాలనుకున్నాను. మీరేమో మట్టి పెళ్లలుగా మిగిలిపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో మీరు సంఘటిత శక్తిగా ఎదగాలనుకున్నాను. మీరేమో ఎవరికి వారు వ్యక్తులుగా ఎదగాలని అనుకుంటున్నారు. నేనేమో రాజ్యాంగమనే ఆయుధంతో గౌతమబుద్ధుడు, జ్యోతీరావుఫూలే మొదలు పెట్టిన యుద్ధం గెలవాలని అనుకున్నాను. మీరేమో రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తూ నిద్రపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో పూర్వికుల చరిత్ర చదివి, ఆచరించి, పీడిత తాడిత మూల వాసుల తరఫున మీరంతా నిలబడాలని అనుకున్నాను. మీరేమో మన పూర్వీకుల చరిత్రే చదవకూడదని అనుకుంటున్నారు.

నేనేమో వచ్చిన స్వాతంత్ర్యం నుంచి వేరే ఇంకో స్వతంత్రం కోరుకోవడం లేదు. %–% వెట్టిచాకిరి, బానిసత్వం, కులం, మతం, దోపిడీ, దౌర్జన్యం %–%



సంకెళ్ల నుంచి మిమ్మల్ని విముక్తుల్ని చేయాలని అనుకున్నాను. మీరేమో ముందు చూపులేకుండా, రాబోయే పెనుముప్పును చూసుకోకుండా కండ్లు మూసుకుని కాలక్షేపం చేయాలని అనుకుంటున్నారు.

స్పృహ లేని ఉద్యోగాల కోసం, స్ఫూర్తి లేని రాజకీయ నాయకుల కోసం, సంఘటితం కాని సంస్కర్తల

**కోసమేనా నా ఈ కన్నీళ్లూ?**

"మీరంతా నా అనుచరులు గనుక, నా జాతివాసుల కోసం, నాదేశ ప్రజల కోసం నేను పడు తున్న ఆవేదనను మీరు సరిగా అర్థం చేసుకుంటారని భావిస్తాను. నా కన్నీళ్లు వథాపోవనీ, వాటి విలువను మీరు వారికి తెలియజెప్తూ ఉంటారని ఆశిస్తాను!" అని అన్నారు అంబేద్కర్. భవిష్యత్తరాల అభ్యున్నతి కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ పడిన ఆవేదన వథా కాకూడదు. మనం మనముందు తరాల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం %–% ఒక బాధ్యతగా స్వకరించాలి! నేటి బాల బాలికలే రేపటి పౌరులు గనక, వారి విద్యాభ్యాసం ఎలా జరగాలి? వారు ఉన్నతమైన ఆశయాలతో ఎలా పెరగాలి?– అన్న విషయం అబ్రహం లింకన్ (12 ఫిబ్రవరి 1809– 15 ఏప్రిల్ 1865) ఒక ఉత్తరంలో నమోదు చేశారు. అమెరికాకు పదహారవ అధ్యక్షుడయిన లింకన్, తన చిన్న కుమారుడైన ట్లాడ్ లింకన్‌కు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడికి ఒకలేఖ రాశారు. అందులో అనేక విష యాలున్నాయి. ఇది కేవలం తన కుమారుడి కోసం రాసిందే అయినా, ఆయన దృష్టిలో ప్రపంచ యువత ఎలా ఎదగాలి %–% అన్న విషయం చర్చించారు. ఆ ఉత్తరం ఇలా సాగుతుంది %–% ప్రతి ఉపాధ్యాయుడూ ఈ ఉత్తరం తనకు వచ్చినట్టుగానే

**భావించుకోవాలి !**

గౌరవనీయ ఉపాధ్యాయుడా! ఈ భూమి మీది మనుషులందరూ న్యాయమైన వాళ్లుకాదు, నిజమైన వాళ్లూ కాదు. ఈ విషయాలు మా అబ్బాయి కచ్చితంగా తెలుసుకోవాలి! మీరు మా వాడికి ఇవి నేర్పించాలి! ప్రతి ఉత్తముడికి ఒక నీచుడున్నాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికీ అంకిత భావంతో పని చేసే ఒక నాయకుడున్నాడు. ప్రతి శత్రువుకీ మనకు ఒక మిత్రుడున్నాడు. లేనిదాని గురించి దిగులు పడే గుణాన్ని మా వాడిలోంచి పారద్రోలండి. వీలయితే నిశ్శబ్దంగా నవ్వుకోగల రహస్యాన్ని వాడి గుప్పిట్లో పెట్టండి. తనకు కొన్ని విషయాలు చిన్న తనంలోనే తెలియాలి. అల్లరి చిల్లర కబుర్లు ఆసక్తి కలిగిస్తాయి. కానీ, వాడికి పుస్తకాల మత్తు, మహత్తూ ఏమిటన్నది అర్థం చేయించండి! అలాగే ఆకాశంలోని పక్షులు, తేనెటీగలు, పచ్చటి కొండల అనంత రహస్యాలను అన్వేషించడానికి వీలయినంత ఎక్కువ సమయం కేటాయించాలని చెప్పండి.

# ఎమ్మెల్సీ కవిత వీటికి జవాబు చెప్పి ధర్నా చేయాలి.. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్(ప్రజా స్వేచ్ఛ)

10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచింది. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల కుటుంబం వారిపై మొసలికన్నీరు కారుస్తోంది. బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదు. అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్ కు బీసీలు గుర్తుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి వారి గొంతు కోసింది బీఆర్ఎస్. లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని ఆమె రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలుపెట్టారు. అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమం. విజ్ఞుల్కైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుతున్నాం. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నన్ను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమే. అంతేకాక రాష్ట్ర క్యాబినెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే.. మీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీ నేతను ఏర్పాటు చేయడం సాధ్యపడుతుందా..? గత మీ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా బీసీలకు ఎంత ప్రాధాన్యతిచ్చారో బహిరంగ రహస్యమే. మీ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కిన మీరు ఇప్పుడు బీసీ జపం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది.

బీసీల పేరుతో ధర్నా చేయాలని నిర్ణయించిన మీకు టీపీసీసీ అధ్యక్షులుగా నేను కొన్ని ప్రశ్నలను సంధిస్తున్నాను. మీరు వీటికి సరైన సమాధానం చెబుతారని ఆశిస్తున్నాను.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

1) కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతమున్న రిజర్వేషన్లను 23 శాతం నుండి 42 శాతానికి పెంచడం కోసం చర్యలు తీసుకొని, అందులో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నందుకు మీరు ధర్నా చేస్తున్నారా..?

2) బీసీలకు రిజర్వేషన్లు పెంచడం ద్వారా పంచాయతీలు, మున్సిపాల్టీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు ప్రాతినిథ్యం లభించే అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా..?

3) స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు చర్యలు చేపడుతున్నందుకు ధర్నా చేస్తున్నారా..?

4) స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించడానికి గాను ప్రజా ప్రభుత్వం రిట్కెర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో కమిటీని నియమించినందుకు ధర్నా చేస్తున్నారా..?

5) జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేందుకు రాష్ట్రంలో కులగణన చేపట్టినందుకు ధర్నా చేస్తున్నారా..?

6) గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమ బడ్జెట్ను 2971.32 కోట్ల రూపాయలకు పెంచినందుకు ధర్నా చేస్తున్నారా..?

7) కాంగ్రెస్ ప్రభుత్వం గీతన్నల ఆవేదనను గుర్తించి తాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా..?

8) గీతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం కాటమయ్య రక్షణ కార్మక్రమాన్ని ప్రారంభించినందుకు ధర్నా చేస్తున్నారా..?

9) బీసీ సామాజిక వర్గానికి సంబంధించి 10 సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినందుకు ధర్నా చేస్తున్నారా..?

10) ఎమ్బీసీ కార్పొరేషన్కు రూ.400 కోట్లు కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?

11) మహాత్మా జ్యోతిరావు ఫూలే గురుకుల పాఠశాలల్లోని వివిధ విభాగాల్లో 5136 మంది ఉద్యోగులను నూతనంగా నియమించినందుకు ధర్నా చేస్తున్నారా..?

12) బీసీ హాస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటికే 20 నిర్మాణాలకు కోసం 100 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?


13) గురుకులాల్లో డైట్ కాస్మోటిక్ చార్జీలు 40 శాతానికి పెంచినందుకు ధర్నా చేస్తున్నారా..?

14) 28 యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్స్ నూతనంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నందుకు ధర్నా చేస్తున్నారా..?

15) బీసీ కార్పొరేషన్ కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 73 కోట్ల రూపాయలను కేటాయించినందుకు ధర్నా చేస్తున్నారా..?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, వారికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా సలహాలు,సూచనలు ఇవ్వాల్సింది పోయి ధర్నా చేపట్టడం దురదృష్టకరం. బీసీల అభివృద్ధి కోసం పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చర్యలు,ప్రస్తుతం ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపట్టిన చర్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని నేను కవితను బీఆర్ ఎస్ నేతలను సవాలు చేస్తున్నాను.

# హై కోర్టు సీరియస్ వార్నింగ్ !!



- ఏవీ రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం
- ఆధారాలు ఉన్నాయా? అని హైడ్రాను నిలదీత

హైదరాబాద్(ప్రజా స్వేచ్ఛ)

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.ఇప్పటి వరకు చేసింది చాలు..ఇక ఆపండంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది.ఖాజాగూడా చెరువులో హైడ్రా కూల్చివేతలపై అంశంపై హైకోర్టులో మంగళవారం నాడు విచారణ జరిగింది.ఈ సందర్భంగా వాదనలు విన్న న్యాయమూర్తి.. హైడ్రా తీరుపై కన్నెర్ర జేశారు. కూల్చివేతలు చేపట్టిన ల్యాండ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది.న్యాయస్థానం ఆధారాలు ఉన్నాయా? అని హైడ్రాను నిలదీసింది.పిటిషనర్ వద్ద అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి కదా? అని హైడ్రాను ప్రశ్నించింది కోర్టు.ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి తేల్చకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని నిలదీసింది. కమిషనర్‌కు చెప్పి కూల్చివేతలు ఆపివేయాలని ఆదేశించారు.న్యాయమూర్తి. లేదంటే తాము ఎలా డీల్ చేయాలో అలా డీల్ చేస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు.ఇలాంటివి పునరావృతం అయితే కమిషనర్ రంగనాథ్‌పై సీరియస్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు న్యాయమూర్తి.ఇదే సమయంలో పిటిషనర్‌కు కూడా కీలక ఆదేశాలిచ్చింది హైకోర్టు ధర్మాసనం.పిటిషనర్ కూడా జీహెచ్ఎంసీ పర్మిషన్ లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయకూడదన్నారు.పిటిషనర్ వేసిన తాత్కాలిక ఫెన్సింగ్ కూడా 24 గంటల్లో పిటిషనరే తొలగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ప్రజా స్వేచ్ఛ జనవరి 02 వలిగొండ ప్రతినిధి

హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన స్వగృహంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి గురువారం వలిగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు పుష్పగుచ్చాలను అందించి, శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అదేవిధంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె కుంభం కీర్తిరెడ్డికి పూల మొక్కలను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధర్ రెడ్డి,బద్దం సంజీవరెడ్డి,మార్కెట్ చైర్మన్ భీమా నాయక్,కాసుల వెంకటేశం,కొండూరు సాయి, కొండూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక సహాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి



ప్రజా స్వేచ్ఛ జనవరి 02 వలిగొండ ప్రతినిధి

వలిగొండ మండలంలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త కీర్తిశేషులు నీలం బాబురావు ఇటీవల అకాల మరణం పట్ల యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి గురువారం బాబురావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మాజీ ఎంపీటీసీ నీలం లలితకు రూ 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సలిగంజి బిక్షపతి చిల్లరి స్వామి.నలబోలు ధర్మేందర్ వలమల బిక్షపతి.నీలం నరేష్ నీలం సుమన్ కట్ట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ముఖ్యమంత్రి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు



ప్రజా స్వేచ్ఛ జనవరి 2 2025 ఘట్కేసర్

మేడ్చల్ మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్ పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం నరసింహారెడ్డి నరేష్ గౌడ్ తిరుమల్ రెడ్డి బుధవారం రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని వారు తెలియజేశారు.

# సంక్రాంతికి రైతు భరోసా.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు

### మంత్రి పొన్నం ప్రభాకర్..!!



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




**కరీంనగర్ ప్రజా స్వేచ్ఛ**
ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా స్కీమ్ అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం (జనవరి 2) కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామని రైతులకు తీపి కబురు చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డులు కూడా త్వరలోనే జారీ చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని.. త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. మాట ఇచ్చినట్లుగానే సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చాం, వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు వేశామని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచామని.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వేస్తున్నామని గుర్తు చేశారు.

2025 సంవత్సరంలో అంత మంచే జరుగుతుందని.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న హుస్నాబాద్ గౌరవాన్ని మరింత పెంచుతానని అన్నారు మంత్రి పొన్నం. నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగునీరు అందించడమే నా తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా చిగురు మామిడి, సైదాపూర్ మండలాలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం పని చేయాలని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని.. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచే ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్?లను ధీటుగా ఎదుర్కోవాలని కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ పదేళ్లు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

### 5 నుంచి రైతు భరోసా అప్లికేషన్లు.. సర్కార్ సంచలన నిర్ణయం..!!

రైతు భరోసాపై విధివిధానాల అమలుపై తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ స్కీమ్ కు సంబంధించి అప్లికేషన్లను తీసుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు అప్లికేషన్లను తీసుకోవాలని కేబినెట్ సబ్ కమిటీ భావించినట్లు సమాచారం. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అనంతరం జనవరి 14 నుంచి రైతు భరోసాను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో రైతు బంధు సాయాన్ని కొండలు,గుట్టలకు, వెంచర్లకు కూడా ఇచ్చారని కాంగ్రెస్ నేతలు అనేక సార్లు ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రూల్స్ మారుస్తామని..అర్హులకు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు భరోసా సాయంపై తీవ్ర చర్చ జరుగుతోంది. రూల్స్ ఎలా ఉంటాయి? ఎలాంటి మార్పులు ఉంటాయి? అన్న అంశంపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఆదాయ పన్ను చెల్లించే వారికి ఉండదన్న చర్చ కూడా సాగింది. ఈ ఊహానాలకు ఎల్లుండి తెరపడనుంది. ఆదాయ పన్ను చెల్లింపు,భూ పరిమితిని ఉంచొద్దని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తులు తీసుకోకుండానే రైతుబంధు సాయాన్ని ఇచ్చింది. అప్లికేషన్లు తీసుకుంటే రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆ సమయంలో ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అప్లికేషన్లు తీసుకోవాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు. ఇది రైతులను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పిఏసీ చైర్మన్ కు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన చాంద్ భాషా ఓబుల్ రెడ్డి



**ప్రజా స్వేచ్ఛ జనవరి 02 శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)**
శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి 2025 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు పిఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన కొండాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు చాంద్ పాషా,బిల్డర్ ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజలందరూ గత సంవత్సరాన్నిస్మరించుకుంటూ నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతూఈ నూతన సంవత్సరంలో ఆశలు ఆశయాలు విజయాలు చేకూరి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు ఈ 2025 నూతన సంవత్సర కాలంలో మీరు నిత్య నూతన ఉత్సహాంతో చిరునవ్వుతో ఉండాలని మీ జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని మీరు చేయబోయే ప్రతీకార్యంలో మీకు విజయం సిద్ధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మీకు మీ కుటుంబ సభ్యులకు2025 నూతన సంవత్సర శుభాకంక్షాలు పిఏసీ చైర్మన్ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన వెంకటాపురం కాంగ్రెస్ నాయకులు



**ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజాపేట జనవరి 02**
రాజాపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం రోడ్ల భవనల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని,ప్రభుత్వ విప్,ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య లను మర్యాదపూర్వకంగా కలిసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూది వెంకటాపురం కాంగ్రెస్ నాయకులు ఇరుగదిండ్ల వెంకటేష్ (ఏసు) తదితరులున్నారు

## ఆటో గూడ్స్ కెరీర్ డ్రైవర్స్



## యూనియన్ నూతన కమిటీ

**ప్రజా స్వేచ్ఛ జనవరి 02 శేరి లింగంపల్లి ప్రతినిధి (అశోక్)**
నూతనంగా శేరిలింగంపల్లి ఆటో గూడ్స్ కెరీర్ డ్రైవర్స్ యూనియన్ కమిటీ ఏర్పాటు చేశారు,అలాగే శేరిలింగంపల్లి లో ఉన్న ప్రతి ఆటొ స్టాండ్ కి నూతన అధ్యక్షులు ఎన్నుకున్నారు ,ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బాలింగ్ గౌతమ్ గౌడ్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ నూతన ఎన్నుకున్న ఆటో స్టాండ్ అధ్యక్షులు కు శుభాకాంక్షలు తెలిపారు అలాగే నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ప్రెసిడెంట్:ఎండీ ఫిరోజ్,
**జనరల్ సెక్రెటరీగా**:ఫహీద్ అలీ,వైస్ ప్రెసిడెంట్ గా:ఎండీ అయ్యూబ్,రాజు ముదిరాజ్,ఎస్ డి కరీం,గచ్చిబౌలి, ఎండీ బాబా గచ్చిబౌలి,
ఎండీ అయూబ్ ఓల్డ్ ఆఫీస్ పెట్,ఎండీ సలీం మియాపూర్ ఎక్స్ రోడ్,షేరు మియాపూర్ హనీఫ్,ఎండీ వహీద్ శ్రీదేవి థియేటర్,శీను రాథోడ్ శ్రీదేవి థియేటర్, లక్ష్మణ్ గచ్చిబౌలి,ఖలీల్ లింగంపల్లి రైల్వే స్టేషన్, ఎండీ అమీర్ హాఫీజ్పేట్ ఎండీ ఆదిల్ అమీన్పూర్ పి.అంజి మియాపూర్ ఎక్స్ రోడ్

## జీవంజి దీప్తి అర్జున అవార్డుకు ఎంపికవడం గర్వకారణం

### -వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్,02జనవర్,ప్రజా స్వేచ్ఛ**
పారా అథ్లెటిక్ జీవంజి దీప్తి అర్జున అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా పురస్కారాలలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి పారా అథ్లెటిక్ మూడవ స్థానం సాధించిన సందర్భంగా కేంద్ర క్రీడల శాఖ అర్జున అవార్డుకు ఎంపిక చేసిన సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పక్షాన,వర్ధన్నపేట నియోజకవర్గం పక్షాన కేంద్ర,రాష్ట్ర

# తెలంగాణలోని ఏపీజీవీబీ ఖాతాదారులకు అలర్ట్, ఏం మార్చుకోవాలో మార్గదర్శకాలు జారీ..!!



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**
ఒక రాష్ట్రం,ఒక గ్రామీణ బ్యాంకు' నినాదంతో తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేశారు. జనవరి 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. దీంతో దేశంలోని అతి పెద్ద గ్రామీణ బ్యాంకుల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఒకటిగా అవతరించింది. ఏపీజీవీబీ శాఖలు,వ్యవస్థల విలీనం కోసం కార్యకలాపాలు,ఆన్ లైన్ బ్యాంకింగ్ సేవలు నాలుగు రోజుల పాటు అంటే 28-12-2024 నుంచి 31-12-2024 వరకు నిలిపివేశారు. ఈ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి తిరిగి అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణలోని ఏపీజీవీబీ శాఖలకు సంబంధించిన ఖాతాదారులు ఏటీఎం కార్డు మార్చుకోవడానికి 01.01.2025 తరువాత,వారి బ్యాంకు శాఖను సంప్రదించాలని బ్యాంకు అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం టీవీబీ వెబ్సైట్ www.tgbhyd.in ను (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 1800 202 725 సంప్రదించవచ్చని సూచించారు. ఏపీజీవీబీ ఖాతాలు కలిగిన తెలంగాణ కస్టమర్లకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఖాతాదారులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మార్గదర్శకాలు ఏపీజీవీబీ బ్యాంకు ఏటీఎం కార్డులను మార్చుకోవడానికి జనవరి 1 తర్వాత నుంచి మీ ఖాతా ఉన్న బ్యాంకులో సంప్రదించాలి.

ఏపీజీవీబీ మొబైల్ బ్యాంకింగ్ వినియోగదారులు,ప్లే స్టోర్ నుంచి టీజీబీ మొబైల్ బ్యాంకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏపీజీవీబీ చెక్బుక్ కలిగిన కస్టమర్లకు టీజీబీ కొత్త చెక్ బుక్ లను ఇప్పటికే మీ చిరునామాకు పంపించారు. ఏపీజీవీబీ పాత చెక్ బుక్ లను వినియోగించవద్దు. పాత చెక్ బుక్ ఉంటే వాటిని మీరు ఖాతా కలిగిన శాఖలో తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఏపీజీవీబీ చెక్ జారీ చేస్తే అది 90 రోజుల వరకు చెల్లుబాటు అవుతుంది. దీనిపై ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ వినియోగించే ఖాతాదారులు www.tgbhyd.in ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవచ్చు.

నగదు బదిలీకి ఉపయోగించే ఆర్టీజీఎస్,ఎన్ఈఎఫ్టీ లావాదేవీలకు ఉపయోగించే ఐఎఫ్ఎస్సీ కోడ్ మారింది. అకౌంట్ హోల్డర్స్ ఇకపై కోడ్ ను వినియోగించాల్సి ఉంటుంది.

టీజీబీ వాట్సాప్ బ్యాంకింగ్, మిస్ కాల్ అలర్ట్ కోసం టోల్ ఫ్రీ నంబర్ 92780 31313ను సంప్రదించాలి. ఈ మార్గదర్శకాలు ఏపీజీవీబీ బ్యాంక్ ఖాతాలు కలిగిన తెలంగాణలోని కస్టమర్లకు మాత్రమే వర్తిస్తాయి.

# బిజినెస్

## జోరుగా యూపీఐ లావాదేవీలు..

**సెంబర్‌లో 8% ఎగిసి రూ.23 లక్షల కోట్లకు**





దేశంలో ఆన్‌లైన్ పేమెంట్స్ జోరుగా సాగుతున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు గత నెల డిసెంబర్‌లో 8 శాతం ఎగిసి 1,673 కోట్లుగా నమోదయ్యాయి. భారత్‌లో యూపీఐ లావాదేవీలు మొదలైన (2016 ఏప్రిల్) దగ్గర్నుంచి ఇదే అత్యధికం కావడం గమనార్హం. వీటి విలువ కూడా 8 శాతం ఎగబాకి రూ.23.25 లక్షల కోట్లకు చేరింది. నిరుడు అక్టోబర్ (రూ.23.50 లక్షల కోట్లు) తర్వాత ఇదే గరిష్ఠం. నవంబర్‌లో రూ.21.55 లక్షల కోట్లుగా ఉన్నాయి.క నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం గత ఏడాది మొత్తంగా దేశంలో 17,200 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2023తో పోల్చితే ఇది 46 శాతం ఎక్కువ. నాడు 11,800 కోట్లే లావాదేవీలే. విలువపరంగా చూస్తే.. రూ.183 లక్షల కోట్ల నుంచి రూ.247 లక్షల కోట్లకు పెరిగింది. దీంతో 35 శాతం వృద్ధిచెందినైట్టెంది. కాగా, నవంబర్‌తో పోల్చితే రోజువారీ లావాదేవీలు డిసెంబర్‌లో 51.6 కోట్ల నుంచి 54 కోట్లకు పెరిగాయి. విలువ కూడా రూ.71,840 కోట్ల నుంచి రూ.74,990 కోట్లకు ఎగిసింది. ఇదిలావుంటే ఐఎంపీఎస్ లావాదేవీలు నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో 8 శాతం పుంజుకొన్నాయి.

# కస్టమర్లను ఆకట్టుకునేందుకు..

## ఈవీలపై రాయితీల వర్షం

**-టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ వాహనాలు చౌక**

**-పాపులర్ మాడళ్లపై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్లు**



విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) ధరలు దిగొస్తున్నాయి. మార్కెట్‌లోని టాప్ కంపెనీలు తమ పాపులర్ మాడళ్లపై భారీ రాయితీలను ప్రకటించాయి. టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ సంస్థలు ఆయా ఈవీలపై ఏకంగా రూ.3 లక్షలదాకా రేట్లను తగ్గించడం విశేషం. డిస్కౌంట్లున్న ఈవీల్లో కార్లు, బైకులు కూడా ఉండటం గమనార్హం. సంప్రదాయ ఇంధన (పెట్రోల్ లేదా డీజిల్) ఆధారిత వాహనాలు కాలుష్యానికి దారి తీస్తున్న నేపథ్యంలో అటు వాహనదారులు, ఇటు ప్రభుత్వాలు ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత కొన్నేండ్లుగా ఆటో అమ్మకాల్లో ఈవీల వాటా సైతం పెరిగింది. అయినప్పటికీ ఈవీలపై తయారీదారులు పెద్ద ఎత్తున డిస్కౌంట్లు ప్రకటించడం మారిన మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

**ఇదీ సంగతి..**

డిమాండ్‌కు మించి పెరిగిన ఉత్పత్తి, డీలర్ల వద్ద పేరుకుపోయిన వాహన నిల్వలు, తగ్గిన విడిభాగాల ధరలు.. మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రేట్లపై డిస్కౌంట్లకు కారణమయ్యాయి. కొత్తగా వచ్చిన కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయెల్ ఎఫీషియెన్సీ (కేఫ్) రెగ్యులేషన్లు కూడా ఇప్పుడున్న మాడళ్లపై ధరల తగ్గింపు దిశగా కంపెనీలను నడిపించాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ400, హీరో వీ1 ప్రో-వీ1 ప్లస్, ఏథర్ 450-రిజ్టా మాడళ్లు చౌకయ్యాయని పేర్కొంటున్నాయి. చివరకు ఆన్‌లైన్ మార్కెటీర్ ఫ్లిప్‌కార్ట్ కూడా ఎలక్ట్రిక్ టూవీలర్లపై రూ.2,500-5,000 మేర ధరల్ని తగ్గించేసింది. ఇక ఈ డిస్కౌంట్లలో ఎక్కువ భాగం వాహన తయారీ సంస్థలు భరిస్తుండగా, మిగతా వాటాను డీలర్లు మోస్తున్నారు. ఎక్స్ఛేంజ్ బోనస్‌లు రూ.15,000 వరకు ఇస్తుండగా, ట్రేడ్ డిస్కౌంట్లు రూ.3,000-5,000 మధ్య ఉన్నాయి. మొత్తానికి దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్ జోష్‌ను అందిపుచ్చుకున్న వాహన రంగ కంపెనీలు.. పొంగల్, సంక్రాంతి ఉత్సాహాన్నీ క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి.

## త్వరలో భారత్ మార్కెట్లోకి హ్యుండాయ్ క్రెటా ఈవీ.




దక్షిణ కొరియా ఆటోమొబైల్ మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా త్వరలో తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ క్రెటా ఈవీ కారును ఆవిష్కరించనున్నది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పో-2025లో దీన్ని ప్రదర్శించే అవకాశాలు ఉన్నాయి. హ్యుండాయ్ నుంచి భారత్ మార్కెట్లోకి వస్తున్న మూడో ఎలక్ట్రిక్ వెహికల్ ఇది. మార్కెట్ నుంచి ఉపసంహరించిన కోనా ఎలక్ట్రిక్ స్థానంలో క్రెటా ఈవీ వస్తోంది. మార్కెట్లో ఇప్పటికే ఉన్న ఐయానిక్ 5 తోపాటు టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ కార్లకు హ్యుండాయ్ క్రెటా ఈవీ గట్టి సవాల్ విసురుతుందని భావిస్తున్నారు.హ్యుండాయ్ క్రెటా - 2024 మాదిరిగానే హ్యుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ వస్తోంది. ఎలక్ట్రిక్ వర్షన్ కారు కోసం కొన్ని కీలక మార్పులు చేశారు. ఫ్రంట్‌లో బ్లాంక్డ్ ఔట్ గ్రిల్లె విత్ ఏ సెంటర్ మౌంటెడ్ చార్జింగ్ పోర్ట్, రేర్‌లో రీడిజైన్డ్ బంపర్, టెయిల్ లైట్స్, న్యూ 17-అంగుళాల ఏరో అల్లాయ్ వీల్స్ ఉంటాయని భావిస్తున్నారు. క్యాబిన్‌లో ఇన్‌ఫోటైన్ మెంట్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ కోసం డ్యుయల్ స్క్రీన్ సెటప్, ఇంటర్నల్ కంబుస్టన్ ఇంజిన్ (ఐసీఈ) కౌంటర్ పార్ట్, ఐయానిక్ 5 లో మాదిరిగా న్యూ స్టీరింగ్ వీల్ డిజైన్, లెథరెట్టే డాష్ బోర్డ్, వైర్ లెస్ ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పనోరమిక్ సన్ రూఫ్, సేఫ్టీ కోసం లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉంటాయి

# టెస్ట్ జట్టు కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ??




నాయకత్వ పాత్ర పోషించొచ్చని గుప్పుగా వార్తలు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ గా విరాట్ కోహ్లీ ఎంపికయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ కెప్టెన్సీ బాధ్యతల కారణంగా రాణించలేకపోతున్నాడు. స్వదేశంలో జరిగిన న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ లో కూడా రోహిత్ ఆకట్టుకోలేదు. ఇక ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ పేలవంగా ఆడుతున్నాడు. హిత్ 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 10.93 సగటుతో 164 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ ఉంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్ లో కేవలం 31??పరుగులే చేశాడు. ఒకసారి మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. దీంతో అతను టెస్ట్ జట్టు నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరైతే రిటైర్మెంట్ ప్రకటించాలంటున్నారు. భారత్ ప్రస్తుత సిరీస్ లో వెనకంజలో ఉంది. ఆస్ట్రేలియా2-1 ఆధిక్యంలో కొనసాగుతోంది. సిడ్నీలో జరిగే ఐదో టెస్ట్ లో భారత్ గెలవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలోనే రోహిత్ శర్మ తన కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకునే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. చివరి టెస్ట్ లో రోహిత్ ఆడతాడా లేదా అనేది కూడా సందేహంగానే మారింది. చివరి టెస్ట్ లో రోహిత్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చుకుంటారా లేదా అని ధృవీకరించడానికి కోచ్ గౌతమ్ గంభీర్ నిరాకరించాడు. పిచ్ ను పరిశీలించి తుది జట్టును ప్రకటిస్తామని చెప్పాడు. దీంతో రోహిత్ ఆడడంపై సందిగ్ధత నెలకొంది. ఆస్ట్రేలియాతో సిరీస్ తర్వాత రోహిత్ భారత టెస్ట్ జట్టు కెప్టెన్సీని వదులుకునే అవకాశం ఉంది. అలా అని వెంటనే రిటైర్మెంట్ ప్రకటించకపోవచ్చని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టులో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని మరింతగా పెంచకుండా ఉండేందుకు రోహిత్ అలాంటి నిర్ణయాన్ని విరమించుకోవచ్చని తెలుస్తోంది. రోహిత్ వెంటనే రిటైర్మెంట్ తీసుకుంటే జట్టును అనిశ్చితి స్థితిలోకి నెట్టివేస్తుందన భావిస్తున్నారు. రోహిత్ కెప్టెన్సీ నుంచి తప్పుకుంటే విరాట్ కోహ్లీ నాయకత్వ పాత్రలో తిరిగి అడుగు పెట్టే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం కోహ్లీ కూడా భయంకరమైన ఫామ్ లో ఏమి లేదు.

## తుది జట్టు కూర్పుపై సమాలోచనలు

**-కసరత్తు చేస్తున్న గంభీర్, రోహిత్**

**-రిషబ్ పంత్ స్థానంలో ధృవ్ జురెల్ జట్టులోకి?**

**-పిచ్ పరిశీలించిన తర్వాతే ప్రకటిస్తామన్న గంభీర్**



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీలో జరగబోయే ఐదో టెస్ట్ లో గెలవాలన టీమిండియా పట్టుదలగా ఉంది. అయితే తుది జట్టు కూర్పుపై జట్టు మేనేజ్ మెంట్ చర్చలు కొనసాగిస్తోంది. ఇండియా ఈ సిరీస్ లో మ్యాచ్ మ్యాచ్ కు మార్పులు చేస్తూనే వచ్చింది. మొదటి మ్యాచ్ లో రోహిత్ ఆడలేదు. మొదటి మ్యాచ్ లో ధృవ్ జురెల్, పడిక్కల్ ఆడాడు. రెండో టెస్ట్ కు వచ్చేసారికి రోహిత్, శుభ్ మన్ గిల్, రవిచంద్రన్ అశ్విన్ జట్టులోకి వచ్చారు. రెండో టెస్ట్ నుంచి వాషింగ్టన్ సుందర్, ధృవ్ జురెల్, పడిక్కల్ తప్పించారు. మూడో టెస్ట్ కు వచ్చేసారికి అశ్విన్ స్థానంలో రవీంద్ర జడేజాను తీసుకున్నారు. హర్షిత్ రాణా స్థానంలో ఆకాశ్ దీప్ ను తీసుకున్నారు. నాలుగో టెస్ట్ కు వచ్చేసారికి గిల్ తప్పించి అతన స్థానంలో వాషింగ్టన్ సుందరు తీసుకున్నారు. అయితే రెండు మూడు టెస్ట్ ల్లో బ్యాట్స్ మెన్లు మార్చలేదు. కానీ నాలుగో టెస్ట్ లో శుభ్ మాన్ గిల్ తప్పించారు. అయినప్పటికీ భారత్ ఓడిపోయింది. దీంతో ఐదో టెస్ట్ జట్టు కూర్పులో కీలక మార్పు జరిగే అవకాశం

# స్పోర్ట్స్

## రోహిత్ శర్మ రిటైరైతే అస్సలు షాక్ అవ్వను

**భారత్ మాజీ కోచ్, మాజీ క్రికెటర్, కమెంటెటర్ రవి శాస్త్రి**




త కొన్ని రోజులుగా రోహిత్ శర్మ రిటైర్మెంట్ పై ఊహాగానాలు కొనసాగుతోన్నాయి. ముఖ్యంగా అతడు టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటాడని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ ఘోరంగా విఫలమయ్యారు. ఐదు ఇన్నింగ్స్‌లలో నాలుగు సింగిల్ డిజిట్ స్కోర్‌లను నమోదు చేశాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 6.2 సగటుతో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో అతన్ని జట్టు నుంచి తప్పించాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టెస్ట్ క్రికెట్ రోహిత్ వీడ్కోలు పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. గురువారం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్ తర్వాత రోహిత్ రిటైర్మెంట్ ఊహాగానాలు మరింత తీవ్రమయ్యాయి. ఐదో టెస్ట్ కోసం రెగ్యులర్ కెప్టెన్ ప్లేయింగ్ 11లో కనిపిస్తాడో లేదో నిర్ధారించడానికి గంభీర్ నిరాకరించాడు. తాజాగా రోహిత్ ఆటపై భారత్ మాజీ కోచ్, మాజీ క్రికెటర్, కమెంటెటర్ రవి శాస్త్రి స్పందించారు. అతని కష్టాలు కొనసాగితే రోహిత్ కెరీర్ త్వరగా ముగియవచ్చని పేర్కొన్నాడు. పెర్త్‌లో జరిగిన ఓపెనింగ్ టెస్ట్‌కు భారత కెప్టెన్ దూరమయ్యాడు. కానీ అతను లేకుండానే జట్టు విజయం సాధించగలిగిందని గుర్తు చేశాడు. "అతను తన కెరీర్‌పై కాల్ తీసుకుంటాడు. అయితే అతనేమి యువకుడు కాదు. రోహిత్ శర్మ రిటైరైతే అస్సలు షాక్ అవ్వను" అని శాస్త్రి పేర్కొన్నాడు. చాలా మంది యువ ఆటగాళ్లు ఉన్నారని చెప్పాడు. నాణ్యమైన ఆటగాడు శుభ్‌మన్ గిల్ ఉన్నాడు. కానీ అతను ఆడలేదు. అతను బెంచ్ మీద కూర్చుని ఏమి చేస్తున్నాడు అని ప్రశ్నించాడు. సిడ్నీలో జనవరి 3 నుంచి ఐదో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ఆడే భారత జట్టులో కీలక మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. తుది జట్టులో రోహిత్ శర్మ, రిషబ్ పంత్ ఆడడంపై సందిగ్ధత కొనసాగుతోంది.



# బాలయ్య కొత్త పాట రిలీజ్

సింహా సినిమాలో దబిడి దిబిడే అంటూ నందమూరి బాలకృష్ణ చెప్పే డైలాగ్ ఏ రేంజ్‌లో ఫేమస్ అయ్యిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడిదే డైలాగ్‌ను పాటగా మార్చేసి ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. బాలకృష్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం డాకు మహారాజ్. ఎన్‌బీకే 109 తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. తాజాగా డాకు మహారాజ్ థర్డ్ సింగిల్ దబిడి దిబిడి సాంగ్‌ను ఇవాళ సాయంత్రం 5:16 గంటలకు లాంచ్ చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సాంగ్ లుక్ విడుదల చేశారు. అన్‌స్టాపబుల్ మాస్ బ్లాస్ట్ సాంగ్‌లో బాలకృష్ణ, ఊర్వశి రౌటేలా స్టైలిష్ మాస్ డ్యాన్స్ ఉండబోతున్నట్టు లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన హై ఎనర్జిటిక్ నెట్టింట సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తుండగా.. ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా టెక్సాస్‌లోని డల్లాస్‌లో జనవరి 4నలో సాయంత్రం 6 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుగనున్న విషయం తెలిసిందే.

# లవ్ స్టోరీని రివీల్ చేసిన క్రీర్తిసురేష్



'మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్. తెలుగు, తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే తన చిన్ననాటి మిత్రుడు ఆంటోనీ తట్టిల్ ను కీర్తి ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గత నెల గోవాలో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఆంటోనీతో తన ప్రేమబంధాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది కీర్తి సురేశ్. 12వ తరగతి చదువుతున్నప్పుడే తాను ఆంటోనీతో ప్రేమలో పడినట్లు చెప్పుకొచ్చింది. తన కంటే ఆంటోనీ ఏడేళ్లు పెద్ద అని.. 15 ఏళ్ల నుంచి ఇద్దరం ప్రేమించుకుంటున్నట్లు తెలిపింది. తొలిసారి 2010లో ఆంటోనీ తనకు ప్రపోజ్ చేసినట్లు చెప్పుకొచ్చింది. 2016 నుంచి ఇద్దరి బంధం మరింత బలపడిందని.. తనకు ఆంటోనీ ప్రామిస్ రింగ్‌ను బహుమతిగా ఇచ్చినట్లు తెలిపింది. పెళ్లి చేసుకునే వరకూ ఆ రింగ్‌ను తీసేయలేదని చెప్పింది. తాను నటించిన సినిమాల్లో కూడా ఆ రింగ్‌ను గమనించొచ్చని పేర్కొంది. 'మేమిద్దరం వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచడానికే ఇష్టపడతాం. ఎన్నో సంవత్సరాలుగా ప్రేమలో ఉన్నా.. పెళ్లి ఫిక్స్ అయ్యే వరకూ మా ప్రేమ విషయం సీక్రెట్‌గానే ఉంచాలని నిర్ణయించుకున్నాం. నేను ఆంటోనీతో ప్రేమలో ఉన్నట్లు నా స్నేహితులు, ఇండస్ట్రీలో కొంతమందికి మాత్రే తెలుసు. సమంత, విజయ్, అట్లీ, ప్రియా, ప్రియదర్శన్ వంటి వారికి మాత్రమే మా ప్రేమ గురించి తెలుసు. 2017లో మేమిద్దరం మొదటిసారి విదేశాలకు కలిసి వెళ్లాం. 2022లో పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. 2024 డిసెంబర్‌లో ఒక్కటయ్యాం. ఆంటోనీ నా కెరీర్‌కు చాలా సపోర్ట్ ఇస్తాడు. తను నా జీవితంలోకి రావడం నిజంగా నా అదృష్టం' అని తన ప్రేమ కథను వివరించింది ఈ మహానటి.

# చేసిన సినిమాలన్నీ ఫ్లాప్.. కానీ హాట్‌నెస్ కేరాఫ్ అడ్రస్



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది ముద్దుగుమ్మలు స్టార్ హీరోయిన్ రేంజ్ కు వెళ్ళడానికి చాలా ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ కొంతమంది భామలకు అదృష్టం కలిసి రాదు. ఎన్ని సినిమాలు చేసినా అవి ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో మాత్రం క్రేజీ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను కవ్విస్తున్నారు. పై ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ కూడా అంతే.. చేసిన సినిమాలన్నీ డిజాస్టర్స్ కానీ అమ్మడి ఫాలోయింగ్ చూస్తే మతిపోవాల్సిందే. ఈ బ్యూటీ చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి.. కానీ క్రేజ్ మాత్రం కేక. అందంలో తనకు తానే సాటి.. పరువాలతో కుర్రకారును తన వలలో వేస్తుంది ఈ కుర్రాది. గ్లామర్ తో కుర్రకారును కట్టిపడేస్తున్న తొలి సినిమాతోనే అభిమానులను ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకేఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ గా మారిన ముద్దుగుమ్మల్లో ప్రియా ప్రకాష్ వారియర్ ఒకరు. ఈ క్రేజీ బ్యూటీ సినిమాలతో కంటే సోషల్ మీడియాలోనే ఎక్కుగా బిజీగా గడిపేస్తోంది. చేసింది తక్కువ సినిమాలే కానీ మంచి క్రేజ్ తెచ్చుకుంది. కేవలం ఒక్క వీడియో క్లిప్‌తో రాత్రికి రాత్రే పాపులర్ అయ్యింది ప్రియా ప్రకాష్ వారియర్. కన్ను కొట్టి కుర్రకారును కట్టిపడేసింది. ఓరు ఆధార్ లవ్ అనే సినిమాతో పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. కానీ ప్రియా ప్రకాష్ కు మంచి క్రేజ్ వచ్చింది.ఆతర్వాత మలయాళంలో వరుసగా సినిమాలు చేసింది. ఇక తెలుగులో నితిన్ హీరోగా నటించిన చెక్ అనే సినిమాతో అడుగు పెట్టింది. కానీ ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. కేరళకు చెందిన ఈ బ్యూటీ మలయాళ సినిమాలతో పాటు తెలుగు, హిందీ, కన్నడ సినిమాల్లోనూ నటిస్తోంది. మొన్నామధ్య పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన బ్రో సినిమాలో చేసింది. కానీ హీరోయిన్ గా కాదు. తేజ్ సిస్టర్ గా కనిపించింది ఈ భామ. ఈ సినిమా తర్వాత మరో సినిమా ఒకే చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటోంది. హాట్ ఫోటోలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది ఈ చిన్నది. తాజాగా ఈ భామ షేర్ చేసిన ఫోటోలు కుర్రాళ్ళ మతి పోగొడుతున్నాయి.



# ధనుష్ కొత్త సినిమా ఫస్ట్ లుక్ విడుదల

గతేడాది 'కెప్టెన్ మిల్లర్', 'రాయన్' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లను అందుకున్నాడు ధనుష్. రాయన్ సినిమాతో అయితే మెగాఫోన్ పట్టి మరోసారి దర్శకుడిగా నిరుపించుకున్నాడు. అయితే ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఇడ్లీ కడై (ఇడ్లీ కొట్టు)'. ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను డాన్ పిక్చర్స్ నిర్మిస్తుండగా.. నిత్యమీనన్ కథానాయికగా నటిస్తుంది. అయితే న్యూ ఇయర్ కానుకగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ ఫస్ట్ లుక్ చూస్తుంటే.. గ్రామీణ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాను సమ్మర్ కానుకగా.. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమాతో పాటు ఇళయరాజా బయోపిక్, శేఖర్ కమ్ముల కుబేరా సినిమాలో నటిస్తున్నాడు ధనుష్.

# అడ్వెంచర్‌కు అంతా సిద్ధం




రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా నటించబోతున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ అప్‌డేట్ కోసం దేశవ్యాప్తంగా అభిమానుల్లో ఆసక్తినెలకొని ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రాజమౌళి డైరెక్ట్ చేస్తున్న సినిమా ఇదే కావడం, ఆయన దర్శకత్వంలో మహేష్‌బాబు తొలిసారి నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ హైప్ క్రియేట్ చేస్తున్నది. ఈ సినిమా ఎప్పుడు లాంచ్ అవుతుందోనని అభిమానులు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. జనవరిలో పట్టాలెక్కనుందని గతంలోనే వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం నేడు హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఈ సినిమాను మొదలుపెడతారని తెలిసింది. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. సాధారణంగా ప్రతీ సినిమా ప్రారంభానికి ముందు ప్రెస్‌మీట్ పెట్టి ప్రాజెక్ట్ వివరాలను వెల్లడించడం రాజమౌళి ఆనవాయితీ. మరీ ఈ సినిమా విషయంలో ఆయన అదే పద్ధతి ఫాలో అవుతారో లేదో వేచిచూడాల్సిందే. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా కోసం వెయ్యికోట్ల బడ్జెట్ కేటాయించారని వార్తలొస్తున్నాయి. కీరవాణి సంగీతాన్నందించనున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మించనున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492